క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక


కుమార్, అధ్యక్షుడు

చిట్యాల: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ తెలిపారు. అధ్యక్షుడిగా మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన పర్లపెల్లి కుమార్, ఉపాధ్యక్షులుగా పుల్ల అశోక్, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల రమేశ్, మండల కోశాధికారిగా రత్న రమేశ్, మండల కార్యదర్శిగా మట్టివాడ కుమార్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. తనను మండల అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్ మహారాజ్, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపాడు. మండల స్థాయిలో బలోపేతం చేయడానికి తన వంతుగా శక్తి వంచన లేకుండా పని చేస్తానని పేర్కొన్నారు.

జీవాలకు టీకాలు



టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి, రామకిష్టాపూర్(టి)లోని గొర్రెలకు మండల పశువైద్యాధికారి వివేక్ ఆధ్వర్యంలో శనివారం పీపీఆర్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. జీవాలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పశువైద్యుల సలహా మేరకు వైద్యం చేపించాలన్నారు. ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకుంటే జీవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఆయన వెంట గోపాల మిత్ర మేకల కుమార్ ఉన్నారు.

గాంధీనగర్‌లో చోరీ

రేగొండ(కొత్తపల్లిగోరి): తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి బంగారం, నగదును చోరీ చేసిన ఘటన కొత్తపల్లిగోరి మండలంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన నల్లెల సూరయ్య శుక్రవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం వేలిముద్రలను సేకరించారు. ఇంట్లో బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ.50 వేలు నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు సూరయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్వాధీనం

రేగొండ: మండలంలోని గూడెపల్లిలో శనివారం గుడుంబా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. వంద లీటర్ల బెల్లం పానకం పారబోసి, పది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్న ధరంసోత్ సంపత్, నాగవత్ రాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



ఏటూరునాగారం : మండల కేంద్రంలో వైభవంగా నిర్మాణం అవుతున్న హరిహర పుత్రుడు అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి తమ వంతు సహాయంగా రామన్నగూడెం వాస్తవ్యులు అప్పని సమ్మయ్య-ముత్తమ్మ దంపతులు రూ.24వేలు విలువ చేసే వెండి, బంగారం వస్తువులను విరాళంగా కమిటీ వారికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో గౌరిశంకర్, ఎగ్గడి కోటయ్య, అల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

శాయంపేట : రాష్ట్రంలోని అర్హులందరికీ ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ మండల కార్యదర్శి సదానందం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 30 నుంచి 2026 డిసెంబర్ వరకు పార్టీ పోరాట చరిత్రను, ఉద్యమాలను గ్రామగ్రామాన తెలియపరిచేందుకు సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు గుడిసెలు ఏర్పాటు చేయించామని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ ప్రభుత్వాన్ని కోరారు. వంద రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని మూడోసారి అధికారి చేపట్టిన బీజేపీ ధరల నియత్రణలో విఫలం చెందిందని ఆరోపించారు. విజిలెన్స్ అధికారులతో బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై దాడులు చేయించి నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి, మండల సహాయ కార్యదర్శి అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతరకు వేళాయె..

14 నుంచి బుగులోని వెంకన్న జాతర

- రెండో తిరుపతిగా ప్రసిద్ధి
- ప్రభ బండ్లు ప్రత్యేక ఆకర్షణ


బుగులోని గుట్టలు, ఉత్సవ విగ్రహాలు (ఇన్‌సెట్‌లో)

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారు గుట్టల్లో వెలసిన బుగులోని వేంకటేశ్వర స్వామిని భక్తులు కొంగు బంగారంగా కొలుస్తున్నారు. కార్తీక పౌర్ణమికి అభయ స్వరూపుడిగా స్వామి వారు దర్శనమిస్తారని భక్తుల విశ్వాసం. ఏటా ఐదు రోజుల పాటు జరిగే జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు చెల్లిస్తారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న బుగులోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. జాతర ఉత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమై 18 వరకు నిర్వహించనున్నారు. ఎండోమెంట్ అధికారులు జాతర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతర వివరాలు..

- 14వ తేదీన స్వామి వారి ఊరేగింపు, కొండపైకి స్వామి వారిని మేళతాళాలతో తీసుకెళ్లట.
- 15న స్వామి వారి కల్యాణం, ఏనుగు వాహనాలు తిరుగుట, స్వామి వారికి మొక్కులు చెల్లించుట.
- 16న అభిషేకం, వాహనాలు తిరుగుట.
- 17న మొక్కులు చెల్లింపు.
- 19న మొక్కుల చెల్లింపు, మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో ముగింపు.

బుగులోని ఆలయ చరిత్ర

వేంకటేశ్వరస్వామి ఇద్దరు భార్యలైన పద్మావతి, అలివేలు మంగతో కలిసి ఆకాశ మార్గాన విహరిస్తుండగా అలసట తీర్చుకుందామని పద్మావతి తిరుమల తిరుపతి కొండలపై విశ్రాంతికి ఉపక్రమిస్తారు. అక్కడి మహిళలు పాటలు పాడుతూ వడ్లు దంచుకుంటున్న క్రమంలో శబ్దాలకు నిద్రపట్టని స్వామి వారు బుగులు (భయం)తో తిరుమలగిరి శివారులోని కొండపైకి వచ్చి విశ్రాంతి తీసుకుని వెళ్లారని నాటి చరిత్ర. దీంతో స్వామి వారు నడయాడిన ప్రాంతంగా రెండో తిరుపతిగా ప్రసిద్ధిగాంచింది. స్వామి వారు గుట్టపై ఉన్నప్పుడు అతని ఆచూకీ తెలుసుకునేందుకు గొల్లకురుమలు అక్కడికి వెళ్లగా వారి గొర్రెలు, చల్లముంతలు, పశువులను స్వామి వారు మాయం చేశారని, మళ్లీ స్వామి వారిని కొలువగా గొర్రెలు, పశువులు, చల్లముంతలు యథాస్థానంలోకి వచ్చాయని గ్రామస్తులు చర్చించుకుటారు. అందుకే అప్పటి నుంచి జాతర ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలుపుతుంటారు.


ఆలయ ముఖద్వారం


రాతి కొండల మధ్య ఆలయంలో శివలింగం

ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణ..

బుగులోని జాతరకు వచ్చే భక్తులు కుటుంబ సమేతంగా ఎడ్ల బండ్లను ప్రత్యేక ఆకర్షణగా వివిధ జంతు రూపాల్లో రూపొందించుకుని జాతరకు వస్తుంటారు. జాతరకు వచ్చే ప్రభ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఐదురోజుల పాటు సాగే జాతరలో ప్రధానంగా మూడు రోజుల పాటు సాగే స్వామి వారి కల్యాణం విశేషంగా ఆకట్టుకుంటుంది.


బుగులోని జాతర నిర్వహించే ప్రాంగణం

ఏర్పాట్లు చేస్తున్నాం..



బుగులోని జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల, ఆలయ కమిటీ సహకారంతో పనులు వేగవంతం చేశాం. అలాగే జాతర విజయవంతానికి ప్రతీ ఒక్కరం సమష్టిగా కృషి చేస్తాం.

– బిల్లా శ్రీనివాస్, ఆలయ ఈఓ

విజయవంతం చేస్తాం..



జాతర నిర్వహణకు అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించాం. అందరి సహకారంతో జాతరను విజయవంతం చేస్తాం. స్వామి వారి కల్యాణంలో భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నా.

– వెంకటస్వామి, ఆలయ కమిటీ చైర్మన్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కోటగిరి సతీశ్

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట ఎల్లమ్మ తల్లి ఆలయంలో రూ.5లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనుల శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం సీసీ రోడ్లతో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంగ ప్రభాకర్, మాజీ సర్పంచ్ వంగ కుమారస్వామి, మండల నాయకులు కత్తి సంపత్, చదువు మహేందర్, తుమ్మేటి సురేందర్‌రెడ్డి, బోనగిరి తిరుపతి, శ్రీధర్, రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడి అమానుషం


మాట్లాడుతున్న నాయకులు

గోవిందరావుపేట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసుల దాడి అమానుషమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ అన్నారు. శనివారం మండలం కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ యన మాట్లాడుతూ దళితబంధు రెండో వి డుత నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యేపై పోలీసుల అప్రజాస్వామికమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల స మయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పోలీసులతో దాడులు చేయడం సరి కాదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయడంతో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, లక్ష్మ ణ్, రాజు, వస్రాం, శ్రీనివాసరావు, దేవా పాల్గొన్నారు.

వాహన పత్రాలు కలిగి ఉండాలి


వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై శాఖాన్

చిట్యాల: ప్రతీ వాహనానికి అనుమతి పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయం తెల్లవారు జామున కాలనీలోని ఇళ్లలో తిరిగి తనిఖీ చేపట్టారు. కాలనీలో ఉన్న 30 వాహనాలను తనిఖీ చేసి అందులో పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ వాహనానికి అనుమతి కలిగి ఉండాలని అలాగే నంబర్ ప్లేట్ ఉండాలని అన్నారు. లేకుంటే వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని అన్నారు. ప్రమాదాలకు గురైతే అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. సెకండ్ ఎస్సై ఎండీ.శాఖాన్, పోలీస్ సిబ్బంది లాల్ సింగ్, లింగన్న, అస్లాంజానీ, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో ఎస్సై ఎండీ.శాఖాన్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనానికి నంబర్ ప్లేట్ తప్పకుండా ఉండాలని తెలిపారు. వాహనాల్లో ఏలాంటి నిషేధిత మత్తు పదార్థాలను తీసుకపోకుడని అన్నారు. పోలీస్ సిబ్బంది లింగన్న, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత


బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై

ఏటూరునాగారం: ఇంటి నుంచి పారిపోయిన బాలికను స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వట్టం సురేశ్, లక్ష్మీ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఏడేళ్ల బాలిక ఉంది. ఇంట్లో భార్యభర్తలు గొడవ పడుతుండగా బాలిక దేవి మధ్యలో వెళ్లి తల్లిదండ్రులను నివారించే ప్రయత్నం చేసింది. ఇద్దరు కోపోద్రుకులై బాలికపై చేయి చేసుకునేందుకు రావడంతో భయంతో ఇంటి నుంచి పారిపోయింది. ఈ విషయాన్ని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా పోలీసులు రంగంలోకి దిగారు. ఫిర్యాదు అందిన గంటలో గోదావరి కరట్టపై సంచరిస్తుండగా పట్టుకొని ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్ లలిత కుమారి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

కోతుల బెడదను నివారించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలో కోతుల బెడదను నివారించాలని గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువజన సంఘం నాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీశ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతుల బీభత్సంతో గ్రామంలోని ప్ర జలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలను నాశనం చేయడంతో పాటు ఇళ్లలో దూరి నా నా హంగామా చేస్తున్నాయన్నారు. మేడారానికి వ చ్చిన భక్తులపై దాడి చేస్తూ భయభ్రాంతుకు గురి చే స్తున్నాయన్నారు. మేడారంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలోని విద్యార్థినులపై దాడి చేసి గాయపర్చిన ఘటనలు చాలా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి కోతుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ బాబురావు, అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భోజరావు, సమ్మారావు, యాదగిరి, నరేష్, వెంకన్న, అర్జున్ రమేశ్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గోవిందరావుపేట : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సృజన్ కుమార్ అన్నారు. మండలంలోని పస్రా నాగారంలోని పోలింగ్ బూత్‌లను స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివారం నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేలో ఓటరు నమోదు, తొలగింపు, మార్పులపై నిర్వహిస్తామని అన్నారు.

వాజేడు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ పరిశీలించారు. నూతన ఓటర్ల నమోదు తప్పొప్పులను సరి చేసుకోవడం కోసం ప్రత్యేకంగా క్యాంపెయిన్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శనివారం ఆదివారం బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉండాలని అధికారులు ఆదేశించారు.ఆదివారం కూడా అందుబాటులో ఉండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం


రేగొండ: సర్వేను పరిశీలించిన ఆర్డీఓ మంగీలాల్


చిట్యాల: జూకల్ గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ రామకృష్ణ

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో కుటుంబ సమగ్ర సర్వే శనివారం నుంచి ప్రారంభమైంది. చిట్యాలతో పాటు అందుకుతండాలో ఎంపీడీఓ జయశ్రీ, జూకల్‌లో ఎంపీఓ రామకృష్ణ సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయశ్రీ మాట్లాడుతూ.. ప్రతి ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఏలాంటి తప్పులు లేకుండా త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లను కోరారు.

సర్వే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

రేగొండ: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ మంగీలాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ శ్వేతతో కలిసి పరిశీలించారు. సర్వే నిర్వహణలో ఏమైనా అనుమానులుంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. నిర్ణయించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

మల్హర్‌లో..

మల్హర్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో శనివారం 473 ఇళ్లలో సర్వే చేశారు. సర్వేను మండల ప్రత్యేకాధికారి అవినాశ్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, సామాజిక, కుల గణనను అధికారులు పకడ్బందీగా చేపట్టారు. శనివారం మహదేవపూర్, కాళేశ్వరం, సూరారం, అంబట్‌పల్లి, బొమ్మాపూర్, అన్నారం, మద్దులపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటికి వెళ్లి సర్వే చేశారు. ఈ సర్వేలను డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తదితరులు పరిశీలించారు.


కాళేశ్వరం: మద్దులపల్లిలో సర్వే చేస్తున్న సిబ్బంది

మొగుళ్లపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటా సర్వే కార్యక్రమం శనివారం మండల వ్యాప్తంగా మండలంలోని 26 గ్రామాల్లో ఎన్యుమారెటర్లు చేపట్టారు. సర్వే కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా శనివారం 610 కుటుంబాలను సర్వే చేశారు.

టేకుమట్ల: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శైలజ ఎన్యుమరేటర్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: తప్పులు లేకుండా కులగణన సర్వేలో సమగ్రంగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని ఎంపీడీఓ సుమనవాణి సూచించారు. తాడ్వాయిలో శనివారం నుంచి ప్రారంభించిన కుటుంబ సమగ్ర సర్వేను ఆమె తనిఖీ చేశారు. తాడ్వాయిలోని ఇంటింటా ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. కుటుంబ సభ్యులు వివరాల నమోదు ఎలా చేస్తున్నారని సర్వే చేస్తున్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్ ఉన్నారు.


మొగుళ్లపల్లి: సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సునీత


మల్హర్: రుద్రారంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్


టేకుమట్ల: సర్వేలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి శైలజ

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ములుగు: ఫినెక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 17న జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాల్గో విడత ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు ఫౌండర్ జంపన్ననాయక్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పత్తిపల్లిరోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు షుగర్, బీపీ, ఉచితకంటి పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రిలో ఉచిత ఆపరేషన్ చేయబడుతుందని తెలి పారు. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి రానున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు 9676977278 నంబర్‌కు వివరాలు అందించి నమోదు చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చేటప్పు డు ఆధార్ కార్డు, ఇది వరకు తీసుకుంటున్న మందుల చీటీలు, ఫోన్‌నంబర్ తీసుకు రావాలని కోరారు.